


www.netifocusnews.com
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 19, సెప్టెంబర్ 2025
పేజీలు 4

## అమెరికాలో 'వేటా' ఆధ్వర్యంలో

# బతుకమ్మ వేడుకలు

## మంత్రులను ఆహ్వానించిన ఝాన్సీ రాజేందర్‌రెడ్డి

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-సెప్టెంబరు 18:

**అమెరికా కాలిఫోర్నియాలో వుమెన్ ఎంపవర్‌మెంట్** తెలుగు అసోసియేషన్ (ఔజుూా) ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించబడనున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ను మరియు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమర్క సతీమణి నందినిని వేడుకలకు హాజరు కావాలని వుమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మరియు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు ఝాన్సి రాజేందర్ రెడ్డి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కలిసి వారికి ప్రత్యేక ఆహ్వానన్ని అందజేశి మంత్రులను ఆహ్వానించరు. ఈ సందర్భంగా ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను విదేశాల్లోనూ ఘనంగా నిర్వహించడం తెలుగు సాంస్కృతిక వైభవానికి నిదర్శనం. కాలిఫోర్నియాలో వేటా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలు అంతర్జాతీయ వేదికపై తెలంగాణ సాంప్రదాయాన్ని ప్రదర్శిస్తున్నాయి అని అన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మహిళా శక్తిని ప్రతిబింబిస్తుంది. అమెరికాలో నివసిస్తున్న తెలుగు ప్రజలు ఈ వేడుకల ద్వారా తమ స్వదేశాన్ని గుర్తు చేసుకుంటారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సీతక్క మరియు బట్టి నందిని ఈ వేడుకలకు హాజరుకావడం వేటా సభ్యులకు గౌరవంగా భావిస్తారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అమెరికాలోని తెలుగు సంఘాలు, ప్రవాస భారతీయులు విశేషంగా ఎదురుచూస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.





నేటి ఫోకస్ న్యూస్

# మేడారం జాతర మాస్టర్ ప్లాన్ ఖరారు

- ముఖ్యమంత్రి ఆమోదం తర్వాత పనులు ప్రారంభం
- 100 రోజుల ఆధునీకరణ లక్ష్యం
- ఆదివాసీ సంప్రదాయాలు, ఆచారాలపై దృష్టి పెట్టండి
- ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగను ఘనంగా నిర్వహించనున్నారు
- మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి ప్రణాళికను సమీక్ష



(నేటి ఫోకస్‌న్యూస్)-సెప్టెంబర్ 18:

"తెలంగాణ కుంభమేళా"గా పిలువబడే చారిత్రాత్మక మేడారం జాతర కోసం తెలంగాణ ప్రభుత్వం సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేసింది. సమ్మక్క-సారలమ్మ తో ముడిపడి ఉన్న గిరిజన సాంస్కృతిక సంప్రదాయాలను కాపాడుతూ ఈ ప్రణాళిక ఆధునీకరణపై దృష్టి పెడుతుంది. వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి రెవెన్యూ, గృహనిర్మా ణం, సమాచార ప్రజా సంబంధాల శాఖ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ముఖ్యమంత్రి ఆమోదం పొందిన తర్వాత ఆధునీకరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని ప్రకటించారు, వీటిని 100 రోజుల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈ ప్రణాళికలో గద్దెల ఆధునీకరణ, ప్రధాన ఆలయ ప్రవేశ ద్వారం రూపకల్పన, రాతితో కూడిన కాంపౌండ్ గోడల నిర్మాణం మరియు లక్షలాది మంది భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించడానికి ఆలయ ప్రాంగణాన్ని విస్తరించడం ఉన్నాయి. ఆలయ పూజారు లు, గిరిజన పెద్దలు మరియు స్థానిక సంఘాలతో సంప్రదించి డిజైన్లు రూపొందించబడ్డాయి. గురువారం, మంత్రి పొంగులేటి, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ అడ్లూరి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం లో మాస్టర్ ప్లాన్‌ను సమీక్షించారు. వారు 2 రోజుల్లోగా యాక్షన్ ప్లాన్‌ను సమర్పించాలని కన్సల్టెన్సీ సంస్థను ఆదేశించారు. గతంలో క్యూ లైన్లలో రద్దీ కారణంగా పగిడిద్దరాజు గోవిందరాజుల దర్శనం చేసుకోవడానికి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రులు హైలైట్ చేశారు. దీనిని పరిష్కరించడానికి, యాత్రికుల మెరుగైన రాకపోకలు మరియు సౌలభ్యం కోసం ఆలయ ప్రాంగణాన్ని విస్తరిస్తారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా గుర్తింపు పొందిన సమ్మక్క-సారలమ్మ జాతర తెలంగాణ గిరిజన వారసత్వం మరియు భక్తికి ప్రతిబింబమని వారు పేర్కొన్నారు. సమ్మక్క-సారలమ్మ త్యాగాలు గొప్పతనాన్ని కొత్త ఆలయ ప్రాంగణంలో మరింత ప్రతిబింబిస్తాయి. అదనంగా, చమేడారంలోని చుట్టుపక్కల ఉన్న అన్ని దేవాలయాలను ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడానికి సుందరీకరించనున్నారు.

# ఆత్మగౌరవమే అసలు సంపద

- ఆత్మగౌరవం లేకుండా పదవులకు విలువ లేదు
- ఉద్యమ సమయంలో ఎమ్మెల్యే పదవినే గడ్డిపోచలా వదిలేశాం
- ఆత్మగౌరవాన్ని పదే పదే ప్రస్తావిస్తూ భవిష్యత్ రాజకీయాలకు సంకేతాలు
- ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్,(నేటి ఫోకస్‌న్యూస్)-సెప్టెంబర్ 18:

ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా ప్రాంతంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఎమ్మెల్యే పదవిని కూడా గడ్డి పోచలాగా విసిరివేశామని గుర్తుచేశారు. ఆత్మగౌరవం కోల్పోయాక ఎంత పెద్ద పదవి వచ్చినా అది గడ్డిపోచతో సమానం అని ఆయన స్పష్టం చేశారు. నేటి తరంలో పదవుల కోసం పోరాటం జరుగుతున్నా, ఉద్యమ సమయంలో తమకు కావలసింది మాత్రం ఆత్మగౌరవమేనని ఆయన అన్నారు. కాప్రాలో ఏర్పాటు చేసిన నేతాజీ విగ్రహం చిన్న పార్కులో ఉన్నా, దాని మహాత్మ్యం గొప్పదని ఈటల పేర్కొన్నారు. దేశభక్తి, త్యాగం, కట్టుబాటు వంటి విలువలకు ఇది నిలువెత్తు ఉదాహరణ అని చెప్పారు. మహనీయుల విగ్రహాలను ప్రతిష్టించడం అంటే కేవలం పూలదండ వేసుకోవడం కాదు, వారి చరిత్రను భావితరాలకు అందించడం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే తెలంగాణ ఉద్యమ దశలోని పరిస్థితులను గుర్తుచేసుకుంటూ, తెలంగాణ కోసం ప్రజలు చేసిన త్యాగాలు జాతీయ జెండా కింద రక్త తర్పణంగా ప్రతిఫలించాయని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ఎదుగుదల, అభివృద్ధి కావాలంటే ముందుగా ఆత్మగౌరవం, స్వయం పాలన అవసరమని ఈటల వివరించారు. ఈటల వ్యాఖ్యలు కేవలం ఒక వేడుక సందర్భంలో చేసిన ప్రసంగం మాత్రమే కాదని, భవిష్యత్‌లో ఆయన తీసుకునే రాజకీయ నిర్ణయాలకు ఇవి సంకేతాలుగా భావిస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా ఆత్మగౌరవం అనే అంశాన్ని పదేపదే ప్రస్తావించడం ద్వారా, ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని మరింత స్పష్టంగా ప్రజల ముందుంచుతున్నారని చెబుతున్నారు.

# దసరా రద్దీకి ఆర్టీసీ భారీ ఏర్పాట్లు

- రాష్ట్రవ్యాప్తంగా 7,754 ప్రత్యేక బస్సులు
- సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 2 వరకు సర్వీసులు
- హైదరాబాద్ ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు రద్దీ ప్రాంతాల నుంచి సదుపాయం
- ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకూ సర్వీసులు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-సెప్టెంబర్ 18:

బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. ఈ ప్రత్యేక సర్వీసులు సెప్టెంబర్ 20నుంచి అక్టోబర్ 2వరకు అందుబాటులో ఉంటాయని ప్రకటించింది. పండగ కోసం సొంతూళ్లకు వెళ్లేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,754 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. "గత ఏడాదితో పోలిస్తే ఈసారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో షామియానాలు, తాగునీరు, కుర్చీలు వంటి సౌకర్యాలతో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచేందుకు పర్యవేక్షక అధికారులను నియమించాం" అని ఆయన వివరించారు. ఈ నెల 30న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2న దసరా పండగ ఉండటంతో సెప్టెంబర్ 27నుంచే ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. దీనికి అనుగుణంగా బస్సులను సిద్ధం చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తో పాటు కేపీహెచ్‌బీ, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ వంటి రద్దీ ప్రాంతాల నుంచి ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు కూడా ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే ప్రత్యేక బస్సులకు అయ్యే డీజిల్ ఖర్చుల మేరకు మాత్రమే ఛార్జీలను సవరిస్తున్నట్లు సజ్జనర్ స్పష్టం చేశారు. ఈ సవరించిన ఛార్జీలు సెప్టెంబర్ 20, 27 నుంచి 30 వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6 తేదీల్లో నడిచే స్పెషల్ బస్సులకు మాత్రమే వర్తిస్తాయని, రెగ్యులర్ సర్వీసుల ఛార్జీలలో ఎలాంటి మార్పు ఉండదని ఆయన తేల్చిచెప్పారు. ప్రయాణికుల సౌకర్యార్థం 377 ప్రత్యేక బస్సులకు ఆన్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు. ప్రయాణికులు భద్రత లేని ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవద్దని, ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించాలని ఆయన సూచించారు. ముందస్తు రిజర్వేషన్ల కోసం అధికారిక వెబ్‌సైట్ %ట్ట్రజూం:ఌ/స్త్రంతీఎఎబం.ఱఅ% ను సందర్శించాలని, ఇతర వివరాల కోసం 040-69440000, 040-23450033 నంబర్లలో సంప్రదించాలని ఆర్టీసీ యాజమాన్యం కోరింది.



# పార్టీ మార్పు కొత్త పార్టీ పుకార్లన్నీ అవాస్తవం

- కాలేశ్వరం అవినీతిపై అసెంబ్లీలో మొదటిసారి నేను ప్రశ్నించా
- మంత్రి పదవి కోసం ప్రభుత్వంపై విమర్శలన్నది అబద్ధం
- జగన్‌తో భేటీ అవుతున్నానని ఫేక్ ప్రచారం
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-సెప్టెంబర్ 18:

ఎంపీ, ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచే గెలుపొందానని.. కోమటిరెడ్డి ఫ్యామిలీ అంటేనే కాంగ్రెస్ అని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు లేదా కొత్త పార్టీ పెడుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. కాలేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని మొదటిసారి అసెంబ్లీలో ప్రశ్నించిన వ్యక్తిని నేనేనని.. కానీ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నేను సమర్థిస్తున్నట్టు ఫేక్ న్యూస్ వైరల్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటి వరకు ఇలా చేస్తే బాగుంటుందని ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేశానని.. కానీ ప్రభుత్వానికి, పార్టీకి ఎప్పుడూ వ్యతిరేకంగా మాట్లాడలేదని ఆయన స్పష్టం చేశారు. గుంటూరులో ఒక ప్రైవేట్ ప్రోగ్రాంకు వెళ్తుంటే అక్కడ ఏదో జగన్‌ను కలుస్తానని, ఇంకా ఏదేదో ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకు ఏదో మంత్రి పదవి రాకపోవడం వల్ల ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి వ్యతిరేకంగా మాట్లాడుతున్నా అంటూ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నేనేదో కొత్త పార్టీ పెడుతున్నట్టు, పదవికి రాజీనామా చేస్తున్నట్లు పుకార్లు పుట్టిస్తున్నారని.. నేనంటే గిట్టని వ్యక్తులు కొందరు సోషల్ మీడియాలో నా ఇమేజ్ తగ్గించే విధంగా ఫేక్ న్యూస్ వైరల్ చేస్తున్నారని రాజగోపాల్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.

నేటి ఫోకస్ న్యూస్
శుక్రవారం 19, సెప్టెంబర్ 2025

# గర్భిణీలు, బాలింతలు పోషకాహారం సేవించాలి

### అంగన్వాడీ కేంద్రాలకు ప్రత్యేక శిక్షణ సదస్సు

### పోషణ ఆహారంతో పటిష్ట విద్యను అందించాలి

### ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ కమలాదేవి



తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 18

అంగన్వాడి కేంద్రాలలో బలవర్ధకమైన పోషణ ఆహారంతో పాటు నిర్దిష్టమైన విద్యను అందించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని తొర్రూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ కె.కమలాదేవి అన్నారు. గురువారం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని తొర్రూరు, పెద్దవంగర,నెల్లికుదురు మండలాల అంగన్వాడి టీచర్లకు పోషణ్ బి- పడాయి బీ,పోషణ మాసం పేరిట డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్ లో మూడురోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ముగింపు సందర్భంగా సిడిపిఓ కె.కమలాదేవి మాట్లాడుతూ పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదపడుతుందని, చిన్నారులు గర్భిణీలు బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తున్నట్లు తెలిపారు.ఐదేళ్ల లోపు పిల్లలందరికీ అంగన్వాడి కేంద్రాలలో మంచి పోషణ సమగ్ర విద్య అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. చిన్నారుల ఎదుగుదల మహిళల ఆరోగ్యానికి అంగన్వాడి కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయని తెలిపారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు జరిగే ఈ పోషణ మాసంలో అంగన్వాడీ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య- పోషకాహారంపై చర్చలు, ప్రదర్శనలు, ప్రమాణ స్వీకారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓలు విజయలక్ష్మి, బి.సంకీర్తన, సూపర్వైజర్లు మల్లేశ్వరి, శ్రీదేవి, శోభ, గౌసియా, సునీత, నాగమణి,సమన్వయకర్త నడిగడ్డ అశోక్, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు





# హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 18

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్తి నారి సశక్త పరివారు కార్యక్రమంలో భాగంగా గురువారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని బాలికల హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి డాక్టర్ ప్రనీత (గ్రైన కాలోజి ) హాజరయ్యారు. డిప్యూటీ డిఎం హెచ్ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి శిబిరాన్ని సందర్శించారు, స్వస్తా నారి స్వశక్తి పరివారు కార్యక్రమం గురించి అధిక రిస్క్ కేసుల గురించి ఆరా తీశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి సుమారుగా 60 మంది స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్రాజు, మెడికల్ అధికారి డాక్టర్ నందన, వైద్యులు డాక్టర్ మీరాజ్, డాక్టర్ మానస,సూపర్ వైజర్లు సుందరి, కమల, మేరీ, ఏఎన్ఎం, ఎంపిహెచ్ఎ,అశాలు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హీ సేవలో అందరూ భాగస్వాములు కావాలి

### - ఎంపీడీవో వేణుమాధవ్

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 18



సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరగనున్న "స్వచ్ఛతా హీ సేవ" ప్రత్యేక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎంపీడీవో వేణుమాధవ్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని గ్రామాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చెత్త తొలగింపు, డ్రెయినేజీ శుభ్రత, వీధుల పరిశుభ్రత వంటి పనులు అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు కలిసి చేపట్టారు. అంతేకాకుండా పాఠశాలల్లో స్వచ్ఛోత్సవ్, పక్షోత్సవాల భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఈవో బుధారపు శ్రీనివాస్‌తో కలిసి ఎంపీడీవో మాట్లాడుతూ, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పరిశుభ్రమైన పరిసరాల్లోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

### -హెచ్ఎం భీమా నాయక్ వ్యాఖ్యలు

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 18

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పరిరక్షణకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అవుతాపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బానోత్ భీమా నాయక్ అన్నారు.

లయన్స్ క్లబ్ తొర్రూరు ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ దంపతులు లయన్ చంద్రశేఖర్ ఆర్య%-%రాజేశ్వరి పుట్టినరోజు సందర్భంగా పాఠశాలకు రూ.18 వేల విలువ చేసే మైక్ సెట్ అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సెక్రటరీ రవీందర్‌తో కలిసి హెచ్ఎం మాట్లాడుతూ, "ఎక్కడ అవసరం ఉంటే అక్కడ సహాయం అందించడం లయన్స్ క్లబ్ ప్రత్యేకత. పేద విద్యార్థుల ఉన్నతికి ఇలాంటి సేవలు ఎంతో ఉపయోగకరం" అని తెలిపారు.

దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పట్టుదలతో చదువుకోవాలని ఆయన సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు.

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ లయన్ శ్రీను, జాయింట్ సెక్రటరీ లయన్ శంకర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు గంగిశెట్టి రమేష్ కుమార్, ఉపాధ్యాయులు చిరంజీవి, ప్రతిభ, రజిత, అంగన్వాడీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేజీబీవీపై ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 18



మండలంలోని చిన్నవంగర కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ఎంపీడీవో వేణుమాధవ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసం, మౌలిక వసతులు, భోజన సదుపాయం వంటి అంశాలపై సమగ్రంగా వివరాలు సేకరించారు. తనిఖీ సందర్భంగా పాఠశాల ప్రత్యేకాధికారి గంగారపు స్రవంతికి పలు సూచనలు చేస్తూ, విద్యార్థులకు మెనూ ప్రకారం శుభ్రమైన, రుచికరమైన ఆహారం అందించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సలహా ఇచ్చారు. అలాగే విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఎంపీడీవో, చదువుపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో ముందుకు సాగి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### - ఈదురు ఐలయ్య

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు సెప్టెంబర్ 18

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య గురువారం హైదరాబాద్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చైర్మన్‌తో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, పలు సమస్యలు ఇంకా వాస్తవికంగా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్య, ఉపాధి, గిరిజన తండాల అభివృద్ధి, భూసంబంధిత సమస్యలు, సంక్షేమ పథకాల లబ్ధి వంటి అంశాలను ఆయన చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమిషన్ తరఫున ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. వర్గాల అభ్యున్నతే తమ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఐలయ్య మాట్లాడుతూ, గ్రామీణ స్థాయిలో పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పథకాల ప్రయోజనం సకాలంలో చేరేలా కృషి చేయడం అత్యవసరమని, ఈ దిశగా తాను పార్టీ తరఫున నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా ఐలయ్య, కమిషన్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతే తనకు ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.

# పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం





### -పాలమూరుబిరంగారెడ్డి ప్రాజెక్టుల నిర్మాణం పై బహిరంగ చర్చకు సిద్ధం

### -ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి ప్రభుత్వమని, అలాంటి ప్రజా ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిత్యం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ల విషయంలో విషం కక్కుతుండడంతో బహిరంగ చర్చకు రావాలని వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి సవాలు విసిరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సీఎంఆర్ ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేటికీ 12 విడతలలో దాదాపు 60,62,79,058 విలువ గల సిఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి, షాది ముబారక్, తో పాటు ఎల్. ఓ.సి లను 10,073 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ స్వలాభం కోసం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు.

గత ప్రభుత్వంలో కేవలం పేపర్లపై పనులు చూపించేరే తప్ప నిధులు ఎక్కడ మంజూరు చేయాలేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కేవలం 22 నెలల పాలనలో వనపర్తి నియోజకవర్గానికి సుమారు 33860 మంది రైతులకు దాదాపు రూ.253 కోట్లు రుణ మాఫీ చేశామనీ పేర్కొన్నారు.

విద్యారంగఅభివృద్ధి కోసం రూ.50కోట్లు,60 కోట్ల నిధులతో సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మించుకుంటున్నామని వివరించారు.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టిన, స్థానిక ఎన్నికలలో మళ్ళీ ప్రజలముందుకు వస్తున్న బీఆర్ఎస్ ను నమ్మవద్దని, వారిని గెలిపిస్తే కాళ్లకు అడ్డుకర్రలు పెడతారని,ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేప్పటిన గ్రూప్ 1 నియామకాలపై నిరాధారమైన ఆరోపణలు చేసిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేసు నమోదు చేసేలా జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేయాలనీ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు ఎమ్మెల్యే సూచించారు.



# కొత్తకోట తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

### -40వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్ఐ, సర్వేయర్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

వనపర్తి జిల్లా కొత్తకోట మండల తహసిల్దార్ కార్యాలయంలో గురువారం ఏసీబీ తనిఖీలు జరిపారు. నిర్విన్ గ్రామానికి చెందిన ఓ రైతు ఇనామ్ భూముల ఓఆర్సి కోసం వనపర్తి ఆర్డీవో కు దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి నివేదిక పంపాలని ఆర్డిఓ కొత్తకోట తహసిల్దారుకు పంపారు. ఈ మేరకు ఆర్ఐ వాసు, డిప్యూటీ సర్వేయర్ నవీన్ రెడ్డి లు కలిసి రైతుకు అనుకూల నివేదిక అందించేందుకు 40వేలు డిమాండ్ చేయడంతో సదరు రైతు ఏసీబీని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మహబూబ్నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం లింగస్వామి, జిలాని, కిషన్ నాయక్ తహసిల్దార్ కార్యాలయంలో ఆకస్మిక సోదాలు నిర్వహించి ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇరువురిపై కేసులు నమోదు చేసి శుక్రవారం ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

# రేషన్ డీలర్ల ఖాళీలను వెంటనే భర్తీ చేయండి

### -ప్రజా పంపిణీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలి

### -అదనపు కలెక్టరుకు బీసీ పొలిటికల్ జెఎసి వినతి

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ గారిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో అనేకమంది రేషన్ డీలర్లు లేరని, మరి కొంతమంది 6%వా% కేసులపై సస్పెన్షన్లో ఉన్నారన్నారు.

రేషన్ షాపులు ఎవరి పేరుపై ఉంటున్నాయో వారే అందుబాటులో ఉంటూ ప్రజలకు నిత్యావసర సరుకులు అందించాలని,



అలాకాకుండా లైసెన్స్ తమ పేరుపై పెట్టుకొని ఇతరులతో రేషన్ షాపులను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేస్తున్న సరుకులను అందించాల్సిన బాధ్యతలో ఉండాల్సిన వారు తప్పుడు మార్గంలో ఉంటున్నారని, అలాంటి వారిపై దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలాంటి వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని ప్రజా పంపిణీ వ్యవస్థను సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందాల్సిన సరుకుల విషయంలో ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరగాలన్నది బీసీ పొలిటికల్ జేఏసీ ఉద్దేశమని, రేషన్ డీలర్లకు బీసీ పొలిటికల్ జేఏసీ వ్యతిరేకం కాదని, గతంలో రేషన్ డీలర్లకు వేతనాలు పెంచాలని బీసీ పొలిటికల్ జేఏసీ పోరాటం చేసిందని గుర్తు చేశారు.

తక్షణమే రేషన్ డీలర్లలో ఉన్న అవకతవకలను సరిచేసి, తప్పుడు మార్గంలో ఉన్న వారిపై చర్యలు తీసుకొని, ప్రజా పంపిణీ వ్యవస్థలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ తరపున ఆయన అధికారులను కోరారు.

అదనపు కలెక్టర్ ఈ విషయంపై సానుకూలంగా స్పందించారని రాచాల తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అద్యక్షులు అంజన్న యాదవ్, మదనాపూర్ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు, నాగరాజు, యశ్వంత్, రాములు, రంగన్న, నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాల పట్ల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

### -జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**



వనపర్తి జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్నందున రైతుల వ్యవసాయ పొలాల దగ్గర బోరు మోటార్ల దగ్గర విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుని మృత్యువాత పడుతుండడం శోచనీయమని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల ఎస్సైలు, సిబ్బందితో గ్రూప్ వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. ఇంటికి పెద్ద దిక్కు అయిన కుటుంబ యజమాని విద్యుత్ షాక్ కు గురై మృతి చెందితే అతని భార్య పిల్లలు రోడ్డున పడే పరిస్థితి దాపురిస్తుందని అందుకు జాగ్రత్తగా పోలీసులు, విద్యుత్ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఏడాది వనపర్తి జిల్లాలో 11 మంది రైతులు విద్యుత్ షాక్ తో మృతి చెందినట్లు ఆయన వివరించారు.

# జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం

### దంచి కొడుతున్న వర్షం..రోడ్లన్నీ జలమయం

**మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్) సెప్టెంబర్ 18**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యాప్తంగా గురువారం సాయంత్రం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమై రాకపోకలకు తీవ్రా అంతరాయం ఏర్పడింది. సాయంత్రం ఉద్యోగాల నుంచి ప్రజలు ఇంటికెళ్లే సమయం కావడంతో వర్షం కారణంగా ప్రజలు చాలా ఇబ్బంది పడడం జరిగింది. కుత్బుల్లాపూర్, సుచిత్ర, గండి మైసమ్మ, సూరారం, జీడిమెట్ల, షాపూర్ నగర్, దమ్మాయిగూడ ప్రాంతాల్లో



భారీగా వర్షం పడడం జరిగింది.